ప్రజాశక్తి

గురువారం 12 డిసెంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

జివిఎంసి ఆస్తులు ప్రైవేటుపరంపై భగ్గు

- అక్రమాలపై విచారణ జరపాలి
- గుర్రాల పార్కు తీవ్ర అభ్యంతరకరం
- పలు అంశాలపై కార్పొరేటర్ల ప్రశ్నల వర్షం
- వాడివేడిగా సాగిన జివిఎంసి సర్వసభ్య సమావేశం
- 60 అంశాలకు ఆమోదం

గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై ప్రశ్నిస్తున్న టిడిపి కార్పొరేటర్లు

ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుపరం చేయడం తగదని కార్పొరేటర్లు ముక్తకంఠంతో తెగేసి చెప్పారు. బుధవారం జరిగిన జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో పార్టీలతో సంబంధం లేకుండా జివిఎంసి ఆస్తులను కాపాడాలని కోరారు. అక్రమాలు జరిగిన చోట కమిటీలు వేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బుధవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు అంశాలు అజెండాగా ముందుకు వచ్చాయి. వాటిలో 3, 40, 41, 42 అంశాలను రద్దు పరిచారు. 6, 46 అంశాలను వాయిదా వేశారు. అలాగే 21 అనుబంధ అజెండా అంశాలలో ఒక అంశాన్ని తిరస్కరించారు. మూడు, నాలుగు అంశాలను ఆమోదిస్తూ సంబంధిత గుత్తేదారుడును బ్లాక్ లిస్టులో పెట్టాలని, 21వ అంశంపై కమిటీ ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. ఈ క్రమంలో మొత్తం 67 అంశాలకుగాను 60 అంశాలను ఆమోదించారు.

మాట్లాడుతున్న మేయర్

వీటిలో ప్రధానంగా నీటి సరఫరా కార్మికుల వేతనాలకు సంబంధించి అనధికారికంగా 162 మంది సభ్యులు ఉన్నారని కూటమి సభ్యులు అభ్యంతరం లేవనెత్తగా దీనిపై విచారణ కమిటీ వేయాలని మేయర్ హరివెంకట కుమారి ఆదేశించారు. అదేవిధంగా నగరపాలక సంస్థకు చెందిన క్రీడా ప్రాంగణాల సభ్యత్వ రుసుముపై తీవ్ర చర్చ జరిగింది. అందులో మిగతా 2లో..

అక్రమాలపై చర్చ శుభపరిణామం

సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

వార్త 2లో..

భూ సమస్యలను పరిష్కరిస్తాం

వార్త 7లో..

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

వార్త 7లో..

గణేష్ జ్యూట్ మిల్లు తెరవాలని ధర్నా

వార్త 3లో..

డ్యాన్సులతో ఆకట్టుకున్న విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ కల్చరల్ ఫెస్ట్ అదుర్స్

చివరి రోజూ సాంస్కృతిక ప్రదర్శనల జోష్

వార్త 8లో..

సర్వే పేరుతో అర్హుల పింఛన్లు తొలగించొద్దు

మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సామాజిక పింఛన్లు అర్హులందరికీ అందేలా చూడాలని, సర్వే పేరుతో అర్హులను తొలగించే చర్యలు చేపట్టవద్దని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధికారులను కోరారు. బుధవారం ఆమె అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు జెడ్‌పి సమావేశ మందిరంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక పింఛన్ల సర్వేపై ఆరా తీశారు. అర్హులందరికీ పింఛన్లు అందజేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పని చేయాలని ఉమ్మడి విశాఖ జిల్లా అధికారులను కోరారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రతి జెడ్‌పిటిసినీ ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు. ఐదో స్థాయీ సంఘ సమావేశంలో సుభద్ర మాట్లాడుతూ పింఛన్ల సర్వేలో ఎవరినైనా తొలగిస్తున్నారా ? అని అడిగిన ప్రశ్నకు సర్వే మాత్రమే జరుగుతోందని, ఎవ్వరినీ తొలగించడం లేదని పీడీ తెలిపారు. అత్యవసర పరిస్థితులలో 108 అందుబాటులో ఉండాలని సుభద్ర ఆదేశించారు. అంగన్‌వాడీ పాఠశాలలకు మరమ్మతులు అవసరమైతే ప్రపోజల్స్ పెట్టిన వెంటనే నిధులు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన వికలాంగులకు సదరం సర్టిఫికెట్ అందేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ కె.రాజ్ కుమార్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు పాల్గొన్నారు.

సమస్యల ఏకరువు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు రాత్రిపూట అందుబాటులో ఉండటం లేదని పలువురు జెడ్‌పిటిసిలు చెప్పగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి సమాధానమిస్తూ అక్కడక్కడా ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. కొన్ని పాఠశాలల్లో మిగతా 2లో..

నిరసన తెలుపుతున్న జెడ్‌పిటిసిలు

మొదటి పేజీ తరువాయి..

సర్వే పేరుతో అర్హుల పింఛన్లు తొలగించొద్దు

విద్యార్థులకు మరుగుదొడ్లు సరిగాలేవని కొందరు జెడ్‌పిటిసిలు ప్రశ్నించగా జిల్లా విద్యాశాఖ అధికారి బదులిస్తూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆశ్రమ పాఠశాలల నిర్వహణ బాగోలేదని పలువురు సభ్యులు తెలిపారు.

ప్లకార్డుల ప్రదర్శన

మునగపాక జెడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, రాంబిల్లి జెడ్‌పిటిసి ధూళి నాగరాజు, యలమంచిలి జెడ్‌పిటిసి సేనాపతి సంధ్యారాణి, మాకవరపాలెం జెడ్‌పిటిసి రాము సమావేశంలో ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. జిల్లా పరిషత్ అభివృద్ధి నిధులు మంజూరవుతున్నా పనులు జరగటం లేదని, సంబంధిత అధికారులు సహకరించటం లేదని మునగపాక జెడ్‌పిటిసి స్వామి సత్యనారాయణ ఆరోపించారు.

అల్లూరి జిల్లా సమస్యలను పరిష్కరించాలి

- సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు డిమాండ్

మాట్లాడుతున్న గంగరాజు

అల్లూరి జిల్లాలో గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థుల మరణాలను అరికట్టాలని సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు కోరారు. జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాల్లో పాల్గొన్న ఆయన ఈ మేరకు ఛైర్‌పర్సన్‌కు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతగిరి మండలం డముకు నుంచి వాలాసి వరకు రోడ్డు అధ్వానంగా తయారైందన్నారు. రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ రోడ్డును పంచాయతీరాజ్ విభాగం పర్యవేక్షిస్తోందని, ఆర్అండ్‌బికి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. వాలాసి నుంచి వేంగడ మీదుగా పట్టం వరకు, పట్టం నుంచి ఉప్ప వరకు, అలాగే ఉప్ప జంక్షన్ నుంచి పెద్దకోట, పినకోట పంచాయతీల మీదుగా జీనబాడు వరకు తుప్పలు తొలగించి, రోడ్డు గుంతలు పూడ్చాలని కోరారు. ఏజెన్సీలో సదరం క్యాంపులు నిర్వహించేటప్పుడు ఏ సెంటర్‌లో నిర్వహిస్తున్నారో అందరికీ తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. పిహెచ్‌సి కేంద్రాలకు బర్త్ వెయిటింగ్ కోసం వచ్చిన వారికి, రోగులకు భోజన సదుపాయం కల్పించాలన్నారు. ఆసుపత్రి కమిటీ సమావేశాల్లో జెడ్‌పిటిసి సభ్యులకు ప్రాధాన్యత ఇచ్చి సమావేశాలకు పిలవాలన్నారు. మెయింటినెన్స్ నిధులు దుర్వినియోగం కాకుండా కమిటీ సమావేశాల్లో చర్చించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో ఆశ్రమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు తగ్గుతున్నాయని ఫిర్యాదు చేశారు. సాయంత్రం సమయంలో స్టడీ అవర్స్ జరగటం లేదన్నారు. హెల్త్ ఎఎన్ఎమ్, హెల్త్ వర్కర్స్ నియామకాలకు తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలను అరికట్టాలన్నారు. ఏజెన్సీ మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో మృతదేహాల తరలింపునకు డోలీ మోతలే దిక్కవుతున్నాయని, ఇప్పటికైనా రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అరకొరగా ఉన్న ఫార్మేషన్ రోడ్లను గుత్తేదారులు పూర్తి చేయాలని, అందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు జిల్లా పరిషత్ సమావేశాలకు ఎగనామం పెట్టి తప్పించుకుంటున్నారని, సమావేశానికిరాని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సెవెన్ హిల్స్ కార్మికులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ కార్మికులను అక్రమంగా తొలగించే చర్యలను విడనాడి, వారిని యధావిధిగా విధుల్లో కొనసాగించాలని విశాఖ జిల్లా హాస్పిటల్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వై.రాజు డిమాండ్ చేశారు. సెవెన్ హిల్స్ కార్మికులు బుధవారం హాస్పిటల్ నుంచి డాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి పని చేస్తున్న కార్మికులను అక్రమంగా నోటీసులు ఇచ్చి తొలగించడం దారుణమన్నారు. ఈ విషయమై నెల రోజుల నుంచి సెవెన్ హిల్స్ కార్మికులందరూ నిరసన తెలియజేస్తున్నా యాజమాన్యం స్పందించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, సహాయ కార్యదర్శి కె.చంద్రశేఖర్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నర్సింగరావు, సిఐటియు నాయకులు కె.సంతోష్ కుమార్, ఎర్రి బాబు, కె.వరలక్ష్మి, ఎ.జయలక్ష్మి, సిహెచ్.వెంకటలక్ష్మి, ఎ.లావణ్య పాల్గొన్నారు.

జివిఎంసి ఆస్తులు ప్రైవేటుపరంపై భగ్గు

(మొదటి పేజీ తరువాయి..)

ప్రధానంగా ఎంవిపి కాలనీలోని స్పోర్ట్స్ ఎరీనాను ప్రైవేటు వారికి ఏడు సంవత్సరాలకుగాను కాంట్రాక్టుకు ఇవ్వడంతో పాటు నగరం నడిబొడ్డున ఉన్న స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఆధునికీకరణ పనులలో తీవ్ర అక్రమాలు జరిగాయని సభ్యులు అభ్యంతరం లేవనెత్తారు. ఈ క్రమంలో ఈ అంశాన్ని వాయిదా వేశారు. ఇటీవల కాలంలో జివిఎంసి సభ్యులు వెళ్లిన అధ్యయన యాత్రకు చెందిన ట్రావెల్స్ సంస్థ ఎం/ఎస్ స్రవంతి బాధ్యతారహితంగా వ్యవహరించినందున సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టాలని సభ్యులు కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

గుర్రాల పార్కుపై చర్చ

ముడసర్లోవ పార్కు సమీపంలోని మూడు ఎకరాల ప్రాంతంలో సుమారు 6 కోట్ల రూపాయల విలువతో చేపట్టిన గుర్రాల పార్కు ప్రతిపాదనలను వెంటనే రద్దు చేయాలని, ఇప్పటికే గుత్తేదారునికి చెల్లించిన సుమారు మూడు కోట్ల నిధులను రికవరీ చేయాలని సభ్యులంతా కోరారు. ఒకానొక సమయంలో నిధుల విడుదలపై తనకు సమాచారం లేదని మేయర్ చెప్పడంతో ఆమె రాజీనామా చేయాలని కూటమి సభ్యులు నినాదాలు చేశారు. నీరు, కరెంటు, వీధి లైట్లు వంటి ప్రధాన సమస్యలు ఉండగా, గుర్రాల పార్కు పేరుతో నిధులు వృథా చేయడంపై పలువురు సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. దీంతోపాటు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నగరపాలక సంస్థ సీనియర్ అసిస్టెంట్ డి.వెంకట్రావు స్వచ్ఛంద ఉద్యోగ విరమణపై సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

టిడిఆర్‌లు, మొండి బకాయిలపై రగడ

అనుబంధ అజెండాలోని టిడిఆర్ జారీల అంశంపై తీవ్ర చర్చ నడిచింది. పది సంవత్సరాలుగా జారీ చేసిన టిడిఆర్‌ల వివరాలు, వాటి విధి విధానాలను కార్పొరేషన్ సభ్యులకు అందజేయాలని సభ్యులు కోరారు. గత ఏడాది కాలంలో జివిఎంసి పరిధిలో 1035 టిడిఆర్‌లు ఇచ్చారని, సిబిసిఎన్‌సి భూములకుగాను దినకరన్ త్యాగరాజు పేరు మీద రూ.63 కోట్ల టిడిఆర్‌లు నాలుగు పర్యాయాలు ఇచ్చారని, రావులపాలెం పూసపాటి లక్ష్మీపతి రాజుకు, రూ.209 కోట్లు టిడిఆర్‌లు ఇచ్చారని పలువురు సభ్యులు కౌన్సిల్‌కు తెలిపారు. జివిఎంసి పరిధిలో గవర్నమెంట్‌కు చెందిన ఖాళీ స్థలాల్లో పార్కులు ఉన్న ప్రాంతంలో భవన నిర్మాణాలు చేస్తున్నారని, మద్దిలపాలెం, నరసింహ నగర్, మధురవాడ ప్రాంతాల్లో విలువైన స్థలాలను కబ్జా చేస్తున్నారని తెలిపారు.

జివిఎంసికి ఉన్న మొండి బకాయిలపై చర్యలు చేపట్టాలని కోరారు. జివిఎంసిలో చేపట్టిన అభివృద్ధి పనుల విషయంలో కాంట్రాక్టర్లకు గత ఐదేళ్లలో చెల్లించిన బిల్లుల విషయంలో వివరణ ఇవ్వాలని సభ్యులు డిమాండ్ చేశారు.

అక్రమాలపై చర్చ శుభపరిణామం

సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

సమావేశం అనంతరం సిపిఎం ఫ్లోర్ లీడర్, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ పన్ను విధించేందుకు జరుగుతున్న సర్వేపై సభ్యులంతా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. కౌన్సిల్ సమావేశంలో అక్రమాలపై చర్చ జరిగిందని, ముఖ్యంగా వేల కోట్ల రూపాయలకు చెందిన టిడిఆర్‌ల కుంభకోణంపై చర్చ జరిగిందని తెలిపారు. కొంతకాలంగా కొన్ని కౌన్సిల్ సమావేశాల్లో టిడిఆర్‌లపై చర్చ జరుగుతూ వస్తున్నప్పటికీ బుధవారం అక్రమ టిడిఆర్‌లపై తీవ్ర చర్చ జరగడంతోపాటు విచారణకు అన్ని రాజకీయ పార్టీలతో కమిటీ వేయడం శుభ పరిణామమని అన్నారు. గుర్రాల పార్క్‌కు ఆరు కోట్ల రూపాయలను ఒక కాంట్రాక్టర్‌కు కట్టబెట్టేందుకు చర్యలు తీసుకోవడంపైనా చర్చ జరిగిందన్నారు. దీనిని రద్దు చేసేందుకు కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. కాంట్రాక్టర్లు, అధికారంలో ఉండేటటువంటి వాళ్ళు డబ్బులు పంచుకునేందుకు జివిఎంసి ఆస్తులను తమ సొంత ఆస్తులుగా మార్చుకుంటున్నారని తెలిపారు. ఆపరేషనల్ మెయింటెనెన్స్ పేరు మీద జివిఎంసి ఆస్తులను పెద్ద ఎత్తున దోచుకుంటున్నారని తెలిపారు. స్మార్ట్ సిటీ ముసుగులో ఎంవిపి.కాలనీలోని 100 కోట్ల విలువచేసే స్పోర్ట్స్ ఎరీనాను ఏడేళ్ల కాలానికి కాంట్రాక్టుకు ఇచ్చారని, దీనికోసం జివిఎంసి సుమారు రూ.25 కోట్లు వెచ్చించిందని అన్నారు. ఈ ప్రైవేటు లూటీ ఆగాలని, మున్సిపల్ ఆస్తులు ప్రజలకు ఉపయోగపడాలని కోరారు. జివిఎంసిని ఒక వ్యాపార సంస్థగా మార్చేస్తున్నారని, నగరానికి చెందిన 230 కిలోమీటర్ల రోడ్డును ప్రైవేటుపరం చేసేందుకు అధికారులు పన్నాగం పన్నుతున్నారని తెలిపారు. ఇలాగే చూస్తూ ఉంటే రేపు సముద్ర తీరాన్ని కూడా ప్రైవేటుపరం చేసే అవకాశం ఉందని అన్నారు. దీనిపై వచ్చే కౌన్సిల్ సమావేశంలో సిపిఎం తరుపున పోరాడతామన్నారు.

మృతుల కుటుంబాలకు సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న వెంకటరెడ్డి తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అకాల మరణం చెందిన క్లాప్ ఆటో డ్రైవర్ల కుటుంబ సభ్యులకు దహన ఖర్చుల నిమిత్తం రూ. 25 వేలను కాంట్రాక్టర్ ద్వారా ఇప్పించినట్టు జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు తెలిపారు. ఆయా మొత్తాలను బుధవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో యూనియన్ తరపున మృతుల కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, క్లాప్ ఆటో డ్రైవర్లు అనిల్, సురేష్, సన్యాసిరావు, గిరి, చిన్న ఆదినారాయణ, నాయకులు గొలగాని అప్పారావు, జెఆర్.నాయుడు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE VI TH ADDITIONAL SENIOR CIVIL JUDGE
AT : VISAKHAPATNAM
EP No. 171/22 in OS No. 649/2011

Between :
PUJYA SUJATA Agro Farms Pvt.Ltd Reptd by its Mg.Director ...DHr
And
Srinivasa Paint Store and other ...Jdrs

NOTICE

Jdr No-2 :
K.Srinivasarao, S/o late Ankalarao, D.No.47-3-8, DwarakaNagar, Visakhapatnam.

Please take notice in the above named DHR filed above EP against you for realisation of decree amount of Rs.13,24,396/- and the matter coming for your Apperance and stands posted to **30.12.24** on that day your Personally or Through Advocate to attend before the Hon`ble Court at **10.30 A.M** failing which the Hon`ble Court is decided under the Court of law.

(By Court Order)
L. SATYANARAYANA, ADVOCATE, VISAKHAPATNAM
Visakhapatnam
Dt : 09/12/2024
Cell: 9440584322

IN THE HONOURABLE COURT OF THE PRL.JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM
I.A. 30/2022 in O.S. 436/2021

Between :
M.V.S. Nageswararao .. Petitioner/Plaintiff
And
Ch. Praveen kumar & Others .. Respondents/Defendants

NOTICE

R-3 :
Andukuri Haritha, w/o. saravaranan, D.No.19-128, Near Rly Bridge, Pendurthi, Visakhapatnam.

పై నెంబరు దావాను Cancellation of Regd. saledeed నిమిత్తం దాఖలు చేసి అందలి IA 30/22 Intirim Injection నిమిత్తం దాఖలు చెయ్యగా సదరు IA 30/22 నందు R-3 అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ మీకు చేరని కారణంగా యీ పేపరు ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం **తే.09-01-25దీని** వాయిదా అయి ఉన్నది. కాగా **తే.09-01-25 దీన ఉ. 10.30లకు** పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెల్పగలరు. లేనిచో సదరు IAను మీ పరోక్ష మందు తీర్మాణించడమగును.

(By Court Order)
L. SATYANARAYANA, ADVOCATE, VISAKHAPATNAM
Bhimili
Dt. 09.12.2024
Cell: 9440584322

IN THE HONOURABLE COURT OF THE PRL.JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM
O.S. 436/2021

Between :
M.V.S. Nageswararao ...Plaintiff
And
Ch. Praveen kumar & Others ...Defendants

NOTICE

D-3 :
Andukuri Haritha, w/o. saravaranan, D.No.19-128, Near Rly Bridge, Pendurthi, Visakhapatnam.

పై నెంబరు దావాను యిందలి వాది గారు Cancellation of Regd. saledeed No.2956/21 మరియు Permonent Injuction నిమిత్తం దాఖలు చేయ్యగా యిందలి దావా నోటీసు D-3 అయిన మీకు ఎన్నిసార్లు పంపించిననూ మీకు చేరని కారణంగా యీ పేపరు ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం **తే.09-01-25దీని** వాయిదా అయి ఉన్నది. కాగా **తే.09-01-25దీన ఉ. 10.30నిాలకు** పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెల్పగలరు. లేనిచో సదరు దావాను మీ పరోక్ష మందు తీర్మాణించడమగును.

(By Court Order)
L. SATYANARAYANA, ADVOCATE, VISAKHAPATNAM
Visakhapatnam
Dt : 09/12/2024
Cell: 9440584322

IN THE HON'BLE COURT OF THE III ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION)
AT : VISAKHAPATNAM
O.S.75/2024

Between:
M/s. United Hardware Corporation, Rep. by its Managing Parter Sri Masood Mehdi ...Plaintiff
And:
1)Shiny Trade Events & Exhibitions
2) S.K.Sharif, (Event Coordinator) for A.P. Construction & Build Tech Expo, Visakhapatnam ...Defendants

SUMMONS

To,
Defendant No.2:
S.K.Sharif, (Event Coordinator) for A.P Construction & Build Tech Expo, Visakhapatnam

Please take notice that the above-named plaintiff has instituted the above suit against you on the file of the Hon'ble Court of III Addl. Civil Judge (Junior Division) at Visakhapatnam and the same stands posted to **27-12-2024** at **10:30 A.M** for your appearance. You are hereby summoned to appear in the above Court in person or through a Pleader duly instructed on that day. In default of your appearance the matter will be heard and determined in your absence basing on the material available in the Court.

(By Order of the Hon'ble Court)
DURVASULA KETAN,
K. RAMA KIREETI,
Advocates, Visakhapatnam-02

BEFORE THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
E.P. 160/2019 in O.S.259/2018

Between:
Sri. Munakala Srinivas .. D.Hr
And:
Pilaka Suryaveni Bhai & 2 others ...J.Drs

AUCTION NOTICE

It is hereby informed that the public at large herein, the D.Hr/plaintiff filed the suit against the defendants i.e., **Smt. Pilaka Suryaveni Bhai, Pilaka Harsha Reddy** and **Pilaka Sampath Kumar** vide O.S No.259/18 on the file of Hon'ble Principal Senior Civil Judge Court at Visakhapatnam and same was decreed in favour of the D.Hr/plaintiff. Subsequently the D.Hr/plaintiff filed the above **E.P No. 160/2019** against the J.Drs/defendants on the file of **Honourable Principal Senior Civil Judge Court at Visakhapatnam** for recovery of E.P. amount.The Hon'ble Court was directed to publish the schedule mentioned property in **Public Auction for Sale Proclamation** i.e., RCC slabbed building measuring an extent of 87.81 sq Yds. Or 73.41 sq Mts bearing D-No-53-3-13, Assessment No. 45302 covered by Survey No.57, Situated at Dallivari Street Maddilapalem Village, Visakhapatnam Municipal Corporation and bounded by as follows:

EAST : R.C.C Slabbed house of Dalli Lakshmana.
WEST : Common Passage.
NORTH : Tiled house of Dalli Bhulokha Reddy.
SOUTH : Tiled House of Gudla Sanyasi Reddy.

DHR Value of Rupees 10,00,000/- (Rupees Ten Lakhs Rupees Only) Amen value Rupees proclaimed and sell in publication on Prajasakthi Telugu, Daily Newspaper.

The Sale Proclamation for Public Auction is to be held on 30-12-2024 and the same was published in a Prajasakthi Telugu daily newspaper.

Beri Thatha Rao
Advocate
Hig-II-113, Sagar Nagar,
Ward No-8, Visakhapatnam-45

కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్

13వ వార్డు సమస్యలపై వినతి

ప్రజాశక్తి - ఆరిలోవ : 13వ వార్డులోని పలు సమస్యలపై వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత బుధవారం జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. రామకృష్ణాపురంలో ఇంకా పూర్తి కాని రహదారులు, దారపాలెం బంగారమ్మ తల్లి లే-అవుట్‌లో రహదారులు, సింహాద్రి, అల్లూరి సీతారామరాజు లే-అవుట్‌లో రహదారులు, పైనాపిల్ కాలనీ జెఎన్ఎన్‌యుఆర్ఎం గృహాల వెనుక రిటర్నింగ్ వాల్, శ్రీకృష్ణాపురం శ్మశాన వాటిక రక్షణ గోడ ఎత్తు పెంచడం, శివశంకర్ నగర్, సాయినగర్ ప్రాంతాలో రహదారులు, భగత్‌సింగ్ నగర్ కొండవాలు ప్రాంతంలో తాగు నీటికి ఇబ్బంది వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పోలమాంబ జట్టు విజయం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం పెద్దపాలెం చెన్న మైదానంలో బుధవారం ఉపకార్ వైజాగ్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ మొదటి సీజన్ వైజాగ్ వారియర్ వర్సెస్ పోలమాంబ -11 ఎస్ మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో పోలమాంబ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ.5లక్షల క్యాష్ ప్రైజును ప్రముఖ టాలీవుడ్ నటుడు హీరో కంచర్ల ఉపేంద్ర అందజేశారు. ఈ సందర్భంగా హీరో ఉపేంద్ర మాట్లాడుతూ, క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకు ఇలాంటి టోర్నీలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ టోర్నీ మొత్తానికి ఉపకార్ ట్రస్ట్ ఫౌండర్ సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు ప్రోత్సాహం అందించారన్నారు. క్రీడాకారులకు ఎటువంటి సహాయం కావాలన్నా ఉపకార్ ట్రస్ట్ ముందు వరుసలో ఉంటుందని చెప్పారు.



కంపెనీ ప్రతినిధుల నుంచి నియామక పత్రాలు అందుకుంటున్న కాలేజీ ప్లేస్‌మెంట్ హెడ్

ప్రాంగణ నియామకాల్లో 80 మంది ఎంపిక

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ప్రముఖ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థ కెవైబి.మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 80 మందిని ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రూ.2.4 లక్షల వార్షిక వేతనం ఉంటుందని కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ మురళి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ వేణుగోపాల్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్, మెకానికల్ విభాగాధిపతి రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గణేష్ జ్యూట్ మిల్లు తెరవాలని ధర్నా

ప్రజాశక్తి- పద్మనాభం : పద్మనాభం మండలం నేరెళ్లవలస వద్ద ఉన్న గణేష్ జ్యూట్ మిల్లు తెరవాలని కార్మికులు బుధవారం మిల్లు గేటు వద్ద ధర్నా చేశారు. అక్టోబర్ నెల నుంచి పనిచేసిన కాలానికి జీతం, బకాయి ఉన్న ఫిబ్రవరి, ఆగస్టు డిఎలు వెంటనే చెల్లించాలని, సమస్యలు పరిష్కారించాలని, మిల్లు తెరవాలని, కార్మికులకు ఉపాధి కల్పించాలని నినదించారు. అనంతరం ధర్నానుద్దేశించి సిఐటియు నాయకులు టివి.రమణ, కె.సురేష్ మాట్లాడుతూ, అక్టోబర్ నెలలో పనిచేసిన కాలానికి కార్మికులకు యాజమాన్యం నేటికీ జీతాలు చెల్లించకపోవడం, ఫిబ్రవరి ఆగస్టు డిఎలను ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. రెండు నెలల నుంచి కంపెనీని మూసేసి కార్మికులను రోడ్డుమీద పడేసిందన్నారు. కంపెనీ తెరవకుండా కార్మికులను పొడి కూలీలుగా రావాలని, లేకపోతే సెటిల్మెంట్ చేస్తామని బెదిరింపులకు పాల్పడడాన్ని ఖండించారు. వెంటనే యాజమాన్యం స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కార్మిక శాఖ అధికారులను, ప్రజా ప్రతినిధులను కలిసి పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అప్పలనాయుడు, సూర్యనారాయణ, ప్రశాంత్, కృష్ణ, త్రిమూర్తులు, జగదీష్, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

గీతం సైన్స్ డీన్‌కు ఐజియు అవార్డు ప్రదానం

అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ కృష్ణ

ప్రజాశక్తి -మధురవాడ : ఇండియన్ జియోఫిజికల్ యూనియన్ (ఐజియు) భూభౌతిక శాస్త్రవేత్తలకు ఏటా ప్రకటించే ప్రతిష్టాత్మక "హరినారాయణ్ లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు -2024"ను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ అందుకున్నారు. వారణాసిలోని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో జరిగిన ఐజియు 61వ వార్షిక సమావేశాలలో నీతిఅయోగ్ సభ్యుడు డాక్టర్ వికె.సారస్వత్, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ కార్యదర్శి డాక్టర్ ఎమ్.రవిచంద్రన్ ద్వారా ఈ అవార్డును ప్రొఫెసర్ కృష్ణ స్వీకరించారు. సముద్ర శాస్త్ర అధ్యయనాలలో 42 సంవత్సరాల సుదీర్ఘ బోధన, పరిశోధన అనుభవం గల ప్రొఫెసర్ కృష్ణ అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సహ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ (గోవా)లలో పనిచేశారు. ప్రఖ్యాత సంస్థలైన ఒఎన్‌జిసి, గెయిల్, డిజిహెచ్‌లకు హైడ్రోకార్బన్ నిల్వలను వెలికి తీయడంలో శాస్త్రీయ సహకారం అందించారు. ప్రొఫెసర్ కృష్ణ చేసిన సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డుతో పాటు జెసి బోస్ నేషనల్ ఫెలోషిప్‌లను అందుకున్నారు. ప్రొఫెసర్ కృష్ణకు ప్రతిష్టాత్మక అవార్డు లభించడం పట్ల ఇన్‌ఛార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి తదితరులు అభినందించారు.

కౌశల్ సైన్స్ ప్రతిభా అన్వేషణ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : కౌశల్ 2024 జిల్లా స్థాయి సైన్స్ ప్రతిభ అన్వేషన పోటీ ఫలితాలను డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ బుధవారం విడుదల చేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు డిసెంబరు 30న విజయవాడ, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారని తెలిపారు.

ఫలితాలను విడుదల చేస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

మనోజ్ ప్రతిభ

భీమునిపట్నం : ఆన్‌లైన్‌లో జరిగిన కౌశల్ క్విజ్ పోటీల్లో మూడో వార్డులోని జివిఎంసి ఉన్నత పాఠశాల విద్యార్థి దాసరి మనోజ్ ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం ఇమంది వెంకట్రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి కౌశిక్ పోటీలకు ఎంపికవ్వడం పట్ల హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అల్లాడ శ్రీనివాసరావు, ఎ.రామకృష్ణ, సిహెచ్.అశోక్ తదితరులు హర్షం వ్యక్తం చేసి, అభినందించారు. బహుమతి అందజేశారు.

మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కె.రెహమాన్

ప్రజాశక్తి - ఆరిలోవ : మోటారు కార్మికులకు భద్రతతో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటుచేయాలని మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్ కోరారు. హనుమంతువాక స్టాండ్ టాటా మ్యాక్సీ డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశం బుధవారం ముడసర్లోవ పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌కె రెహమాన్ మాట్లాడుతూ, విధి నిర్వహణలో డ్రైవర్లంతా అప్రమత్తంగా ఉండి ప్రయాణికులను గమ్యస్థానాలకు ఎటువంటి ప్రమాదాలు గురి కాకుండా చేర్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత మోటార్ కార్మికులపై తీవ్రమైన ఆర్థిక భారాలు వేశారని తెలిపారు. జిఒ 21, 31ను తీసుకొచ్చి అపరాధ రుసుముల పేరుతో ఆర్‌టిఎ, ట్రాఫిక్ పోలీసుల ద్వారా రూ. వేలల్లో వసూలు చేసున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాహనాల నుంచి పన్నుల వసూలు చేస్తున్నారన్నారు. చెల్లిస్తున్న పన్నుల నుంచి సెస్ రూపంలో ఒక పర్సంట్ కేటాయించి భద్రతతో కూడిన సంక్షేమ బోర్డును వారికోసం ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేశారు. భారీ స్థాయిలో వసూలు చేస్తున్న రోడ్, గ్రీన్ ట్యాక్స్‌లను, లేబర్ చార్జీ, ఇన్సూరెన్స్, ఆర్‌టిఎ చలానా చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు పాండురంగ, అధ్యక్షులు కనకరాజు, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ, సెక్రటరీ రవిశంకర్, చిరంజీవి, అప్పలరాజు, ముఖలింగం తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పెద్దిపాలెం గ్రామానికి చెందిన పోతిన వెంకటలక్ష్మి (51) తరుచూ కడుపునొప్పితో బాధపడుతూ ఉండేది. కడుపునొప్పి తాళలేక బుధవారం ఊరి చివర ఉన్న పొలంలో వెంకటలక్ష్మి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న భార్యను చూసి భర్త శ్రీను తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ సిహెచ్ వాసునాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ నూకరాజు దర్యాప్తు చేస్తున్నారు. వెంకటలక్ష్మికి భర్త శ్రీను, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

నీటి సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని ఆరు గ్రామపంచాయతీల్లో ఏడు చెరువులకు ఈ నెల 14వ తేదీన నీటి సంఘ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఇరిగేషన్ భీమిలి డివిజన్ ఎఇ నళిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారులుగా ఏడుగురిని నియమించామని పేర్కొన్నారు. పొట్నూరు గ్రామానికి చెందిన నూకాంబిక చెరువు పరిధిలో 1022 మంది ఓటర్లు, మద్ది గ్రామానికి చెందిన రాజు వెంకట పెతరాజు చెరువు పరిధిలో 562 మంది ఓటర్లు, పాండ్రంగి గ్రామానికి చెందిన కాటమయ్య చెరువు పరిధిలో 173 మంది, కోరాడ గ్రామానికి చెందిన కృష్ణంరాజు చెరువు పరిధిలో 634 మంది, గంటవరం గ్రామానికి చెందిన కర్రివానిచెరువు పరిధిలో 280 మంది, నరసింహరాజు చెరువు పరిధిలో 409 మంది, పెంట గ్రామానికి చెందిన గుండం చెరువు పరిధిలో 382 మంది రైతులు ఓటర్లుగా ఉన్నారని వివరించారు. ఈ ఎన్నికల నిర్వహణపై బుధవారం గ్రామ సచివాలయాలు వద్ద నోటీసులు అంటించారు.

20న గంధవరం గ్రామదేవతల భూముల వేలం

ప్రజాశక్తి -పద్మనాభం : గంధవరం గ్రామానికి చెందిన గ్రామ దేవతలు పైడితల్లమ్మ, బంగారమ్మ దేవాలయాలకు సంబంధించిన భూములను టెండర్ కం బహిరంగ వేలాన్ని ఈ నెల 20వ తేదీన దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన రైతులు పాల్గొని 2025 ఏప్రిల్ ఒకటి నుంచి 2028 మార్చి 31 వరకు భూములను సాగు హక్కు పొందాలని కోరారు.

భీమిలి బీచ్‌లో మృతి చెందిన ఆలివ్ రిడ్లే తాబేలు

ఆలివ్ రిడ్లే తాబేళ్లు మృత్యువాత

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ కొబ్బరితోట పార్కుకు ఆనుకుని సముద్రపు ఒడ్డున బుధవారం రెండు ఆలివ్ రిడ్లే తాబేళు మృత్యు వాత పడి ఉన్నాయి. దీంతో పర్యావరణ వేత్తలు ఒకింత ఆందోళన చెందుతున్నారు. సముద్రంలో కాలుష్యం పెరిగిపోతుండటం వల్ల ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత్యువాత పడుతున్నాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

నేడు ప్రజా వేదిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు పరిశీలన పూర్తయిన నేపథ్యంలో పలు అంశాలపై చర్చించేందుకు గురువారం స్థానిక మండల కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎన్.హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులపై ఈ ఏడాది డిసెంబర్ 3 నుంచి 11వ తేదీ వరకు 17వ విడత సామాజిక తనిఖీలు, అనంతరం గ్రామ సభలు జరిగాయన్నారు. ఆయా గ్రామ సభల్లో గుర్తించిన అంశాలను చర్చించేందుకు ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆవిష్కరణలకు బహుమతులు

ప్రజాశక్తి-సీతమ్మధార : స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించేందుకు ఎ-హబ్ (ఎయు ఇంక్యుబేషన్ సెంటర్), ఇపిడిసిఎల్ సంయుక్తంగా నిర్వహించిన 'హాక్ ఏపీ హ్యాకథాన్' కార్యక్రమంలో సృజనాత్మక ఆవిష్కరణలను అందించిన ఏడు బృందాలకు రూ.6 లక్షల విలువైన బహుమతులను ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్ ఇమ్మడి అందించారు. ఆంధ్రా యూనివర్సిటీ వేదికగా జరిగిన 13వ ఎడిషన్ 'హాక్ ఏపీ హ్యాకథాన్' కార్యక్రమంలో స్టార్టప్ సంస్థలతో పాటు విద్యార్థులు, నిపుణులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో సహా 72 బృందాలు పాల్గొని విద్యుత్ పంపిణీ వ్యవస్థలోని సమస్యలకు పరిష్కారాలను ప్రదర్శించారు. హ్యాకథాన్ ద్వారా వచ్చిన పరిష్కారాలను అమలుచేయడం ద్వారా సంస్థ సుమారు రూ.2 కోట్లు ఆదా చేయగలుగుతుంది. ఈ సందర్భంగా సిఎమ్‌డి మాట్లాడుతూ వీరు అందించిన పరిష్కారాల ద్వారా సంస్థ మెరుగైన ఫలితాలను సాధించేందుకు, ముఖ్యంగా విద్యుత్ ప్రమాదాలను నిరోధించేందుకు, ఫీడర్ మీటర్ల కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు, ముందస్తుగా నిర్వహణ వైఫల్యాలను గుర్తించుట, బిల్లింగ్ ప్రక్రియను సులభతరం చేయుట, నిరంతరాయ విద్యుత్ అందించేందుకు దోహదపడతాయని వివరించారు.



ఆవిష్కర్తలకు బహుమతులు అందిస్తున్న ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్

వియంఆర్‌డిఏ కమిషనర్ కె.విశ్వనాథన్ మాట్లాడుతూ, విద్య, పారిశ్రామిక రంగాలను అనుసంధానించే దిశగా జరిపే ఇటువంటి హ్యాకథాన్ల నిర్వహణ ఎంతో అవసరమని తెలిపారు. తమ సంస్థలోని సమస్యల పరిష్కారం కోసం ఇటువంటి హ్యాకథాన్‌ను నిర్వహించేందుకు ఎ-హబ్‌ను స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ డైరెక్టర్లు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, సిజిఎం డి.సుమన్, కళ్యాణి, ఎ-హబ్ సిఇఒ రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అవగాహన అవసరం

పల్మనాలజిస్ట్ డాక్టర్ జెవి.ప్రవీణ్

ప్రజాశక్తి-విశాఖపట్నం : టీబీ వ్యాధి పట్ల అవగాహన అవసరం అని ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ జెవి.ప్రవీణ్ చెప్పారు. వ్యాధి పట్ల అవగాహనకు ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ, తమ దగ్గరకు నిమోనియాతో బాధపడుతూ వచ్చే వారు ఎక్కువ అని చెప్పారు. టీబీ ప్రాణాంతకమైన అంటువ్యాధి అని పేర్కొన్నారు. ఊపిరితిత్తుల్లో కఫం ఎక్కువగా చేరడం ద్వారా శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది కల్పిస్తుందని తెలిపారు. ఊపిరితిత్తులకే కాకుండా చర్మం నుంచి మెదడు వరకు వ్యాప్తి చెందుతుందని, పతి భాగానికి సోకే అవకాశం ఉందని వివరించారు. టీబీ ఊపిరితిత్తులకు చేరితే పల్మనరీ టీబీ, మెదడు, వెన్నుపూస, కిడ్నీలు, జీర్ణాశయానికి సోకితే ఎక్స్‌పల్మనరీ టీబీ అంటారని తెలిపారు. బరువు, ఆకలి తగ్గడం, విపరీతంగా దగ్గు, రాత్రిపూట జ్వరం రావడం, చెమటలు పట్టడం, ముక్కు, నోటి ద్వారా రక్తం వంటి లక్షణాలు కనబడితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. కలెక్టరేట్ రోడ్డు, కృష్ణనగర్‌లో ప్రవీణ్ బెస్ట్ క్లినిక్ 2017 సంవత్సరంలో ప్రారంభించామని తెలిపారు. తమ వద్దకు వచ్చే పేషెంట్లకు మంచి వైద్యం అందిస్తూ ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ సలహాలు సూచనలు ఇస్తున్నామని చెప్పారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి నిరుపేదలకు వైద్యంతోపాటు మందులు ఇస్తున్నామని తెలిపారు. 2025 సంవత్సరంలో సేవా కార్యక్రమాలు మరిన్ని ఎక్కువగా చేసే ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.

నూతన భవనంలో పోలీసుల విధులు ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : కొత్తగా నిర్మించిన ఆరిలోవ పోలీస్‌స్టేషన్ నూతన భవనంలో పోలీసు అధికారులు, సిబ్బంది బుధవారం తమ విధులను ప్రారంభించారు. విమ్స్ ఆసుపత్రి వద్ద కొత్తగా నిర్మించిన ఆరిలోవ పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఆదివారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత డిజిపి ద్వారకా తిరుమలరావుతో కలిసి ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా బుధవారం ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు, ఎస్ఐలు రామదాసు, వై.కృష్ణ, శేఖర్, ఇతర సిబ్బంది విధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మల్లేశ్వరరావు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా అన్ని విభాగాలు ఒకే గదిలో విధుల నిర్వహిస్తూ అధికారులు, సిబ్బంది, ఫిర్యాదు దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఎట్టకేలకు కొత్తభవనంలోకి మారడం సంతోషంగా ఉందన్నారు. ఈ భవనంలో సుమారు 17 గదులు అందుబాటులో ఉన్నాయన్నారు.

థింసా నృత్యంలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -భీమునిపట్నం : అమరావతి, విజయవాడలో జరిగిన బాల్ రంగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు థింసా నృత్యంలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు స్థానిక పిఎస్ఎం హైస్కూల్ హెచ్ఎం తిరుమల శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు గాను ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ఎంవి.కృష్ణారెడ్డి ద్వారా విద్యార్థులు జ్ఞాపిక, సర్టిఫికెట్లు అందుకున్నారని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు పి.శ్రీనివాసు, లక్ష్మణకుమారి తదితరులు అభినందించారు.

కళా ఉత్సవ్ పోటీల్లో కూడా...

కళా ఉత్సవ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా తమ పాఠశాల 9వ తరగతి విద్యార్థులు సిహెచ్.వినయ్, పి.శ్రీధర్, ఎస్.ప్రేమ్‌కుమార్, వి.తరుణ్‌సందేశ్, జె.పునీత్ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు హెచ్ఎం తిరుమల శ్రీదేవి తెలిపారు.

విమానాశ్రయం నియమాలపై అవగాహన

ప్రజాశక్తి-పెందుర్తి : ఆదర్శ్ డిగ్రీ కళాశాల బిసిఎ, బిబిఎ, బీకాం, బిఎస్‌ఎస్‌ఐ విద్యార్థులు 50 మంది ఈ నెల 10, 11వ తేదీల్లో విమానాశ్రయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎస్.ఇ.ఫ్లోరా మాట్లాడుతూ, విమానాశ్రయం సిబ్బంది విధులు, ట్రాఫిక్ నియంత్రణ, విమానాశ్రయానికి ప్రయాణికుల రాక, బయలుదేరే ముందు జరిగే నియమనిబంధనల గురించి విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. కో-కరిక్యులర్‌లో భాగంగా ఎయిర్ పోర్టు ట్రాఫిక్ కంట్రోల్ గురించి తెలుసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ టి.థియోఫిలస్, కంప్యూటర్ లెక్చరర్లు కె.బ్యూలామెర్సీ, పి.నవ్య, కెమిస్ట్రీ లెక్చరర్ కె.అమ్మాజీ, కామర్స్ లెక్చరర్ ఎన్.సంధ్యారాణి పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్గానిక్ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గురువారం నుంచి 5వ విశాఖ ఆర్గానిక్ మేళాను ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ మాధవ్ తెలిపారు.

విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న ఎస్.రమణ

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీ కార్మిక సమస్యలు పరిష్కరించాలని విశాఖ కో-ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఎస్.రమణ డిమాండ్‌చేశారు. విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలపై యూనియన్ ఆధ్వర్యాన చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్షలు బుధవారమూ కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యాజమాన్యం కావాలనే కాలయాపన చేస్తూ కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతులు, కార్మికుల కష్టాలతో విశాఖ డెయిరీ ఈ స్థాయికి ఎదిగిందని, అయినా యాజమాన్యం చిన్న చూపు చూడటం తగదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వెల్డింగ్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్‌కు అండ

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక వెల్డింగ్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్‌కు అండగా ఉంటానని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆటోనగర్‌లోని ఏపీ టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఎమ్మెల్యేను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ట్రైనింగ్ తీసుకున్న పిల్లల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా అసోసియేషన్ నిలబడాలని కోరారు. అసోసియేషన్‌కు స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కర్రం కనకారావు, కార్యదర్శి వెంకటరమణ, వైస్‌ప్రెసిడెంట్ పాపారావు, అసోసియేషన్ ప్రతినిధులు ప్రసాద్, రమణ, అచ్చిబాబు, శ్రీహరి, పరదేశి, మురళీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన..

యువతకు కంప్యూటర్ కోర్సు శిక్షణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఎటువంటి లాభాపేక్షా లేకుండా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో యువతీ యువకులకు కంప్యూటర్ కోర్సు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వాహకులు ఎం.ఎల్లాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ శిక్షణలో భాగంగా బేసిక్ కంప్యూటర్స్, వెబ్ టెక్నాలజీ, అదే విధంగా ఐటి కోర్సులు, మల్టీ మీడియా వంటి యువతకు ఉపాధి కల్పించే పలు కంప్యూటర్ సంబంధిత లాంగ్వేజెస్‌లో కూడా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. కంప్యూటర్ బేసిక్స్‌కి 45 రోజులు, ఇతర సాఫ్ట్‌వేర్ సంబంధిత కోర్సులకు 60 రోజుల నుంచి 90 రోజుల కాల పరిమితి ఉంటుందన్నారు. ఈ కోర్సుల్లో శిక్షణ పొందగోరువారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 15 నుంచి క్లాసులు ప్రారంభమవుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 8885351807 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఐనాడలో పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని అయినాడ గ్రామపంచాయతీ పరిధిలో రెడ్డిపల్లి పశువుల హాస్పిటల్ ఆధ్వర్యాన బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పశు గర్భకోశ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం సుమారు 58 పాడి పశువులకు గర్భకోశ చికిత్సలు చేశారు. అవసరమైన పాడి పశువులకు నట్టల నివారణ మందు వేశారు. విశాఖ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పుడు, జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ, పాడి రైతులకు సంస్థ ద్వారా అందిస్తున్న పలు కార్యక్రమాలు, సేవలపై అవగాహన కల్పించారు. పాడి రైతులకు లవణ మిశ్రమం, ఇతర మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అనీల్‌కుమార్, సత్యారావు పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాదరావు, సిబ్బంది, భీమిలి ఏరియా ఆసుపత్రి సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటరమణ, ఆనందపురం పశు వైద్యాధికారి డాక్టర్ అనీల్‌కుమార్, రెడ్డిపల్లి పశు వైద్యాధికారి లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి చినముసిడివాడ నుంచి ఉడాకాలనీ రోడ్డు మరమ్మతులు నిమిత్తం గురువారం కార్పొరేటర్ వసంత శంకరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రోడ్డు అంతా గుంతలమయం కావడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో రూ.20 లక్షలు మంజూరు చేయించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు అప్పలనాయుడు, కిషోర్, రమణ, వెంకట్రావు, విశ్వనాథం, కేశవ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మిక సంఘం సమావేశం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం ఆర్.తాళ్లవలసలో బుధవారం తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. భీమిలి, ఆనందపురం విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న సుమారు 50 మంది షిఫ్ట్ ఆపరేటర్లు, పిక్ లోడ్ సిబ్బంది, జూనియర్ లైన్‌మెన్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారని తెలుగునాడు జోన్ 3, అధ్యక్షులు కె.రవికిషోర్, డిస్కం అధ్యక్షులు బి.ఎం.నాయుడు, జిల్లా అధ్యక్షులు వి.నగేష్ తెలిపారు. సంఘంలో చేరిన వారికి గుర్తింపు కార్డులు అందజేసినట్లు తెలిపారు.

కిసాన్ మేళాను విజయవంతం చేయండి

మాట్లాడుతున్న ఎడిఆర్ డాక్టర్ ముకుందరావు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఎఆర్ఎస్)లో ఈనెల 13న జరిగే 65వ కిసాన్ మేళాను విజయవంతం చేయాలని కేంద్రం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ముకుందరావు కోరారు. ఉత్తర కోస్తా వాతావరణ మార్పులకు అనుకూలమైన లాభసాటి వ్యవసాయం అంశాలపై నిర్వహించే కిసాన్ మేళాలో ఉదయం 9 గంటల నుంచి క్షేత్ర సందర్శన, వ్యవసాయ ప్రదర్శన, క్విజ్, రైతు సదస్సు, ముఖ్య అతిథుల ప్రసంగాలు, వ్యవసాయ ప్రచురణల విడుదల, అభ్యుదయ కర్షకులకు, చక్కెర కర్మాగారాలకు, శాస్త్రవేత్తలకు పురస్కార ప్రదానం, రైతులతో శాస్త్రవేత్తల చర్చాగోష్టి వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన సుమారు 30 నుంచి 40 స్టాల్స్ ప్రదర్శన ఉంటుందన్నారు. సభాధ్యక్షులుగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెం నాయుడు, విశిష్ట అతిథులుగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మంత్రులు కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి తదితరులు పాల్గొంటారన్నారు. సమావేశంలో పంటకోత అనంతర విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జగన్నాధరావు, చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆదిలక్ష్మి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రమణమూర్తి, డాక్టర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1కి ఎంఎస్ఎంఇల సర్వే పూర్తి

పరిశ్రమల జిల్లా జనరల్ మేనేజర్ నాగరాజారావు

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలో సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇలు) సర్వే నవంబర్ 29 నుంచి ప్రారంభ మైందని, ఇంతవరకు 11.7 శాతం పూర్తి చేసినట్లు ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ జి. నాగరాజారావు తెలిపారు. జిల్లాలో అన్ని రంగాల్లో గల 58,717 ఎంఎస్ఎంఇలను గుర్తించామన్నారు. ఇప్పటివరకు 5002 ఎంఎస్ఎంఇల సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి ఒకటి నాటికి సర్వే పూర్తి చేస్తామని, జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, సర్వీసింగ్, వ్యాపారయూనిట్ల సంస్థలు సర్వేకు సహకరించాలని కోరారు.

పోలీసులకు ఉచిత వైద్యపరీక్షలు

పోలీసుల ఆరోగ్యపరీక్షలు పర్యవేక్షిస్తున్న డిఎస్పిలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు డిఎస్పి ఎం శ్రావణి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి బి.అప్పారావు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు సహకారంతో జిల్లా పోలీస్ సిబ్బందికి కుటుంబీకులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రావణి మాట్లాడుతూ పని ఒత్తిడిలో తమ ఆరోగ్యాలను కూడా పట్టించుకోకుండా విధులను నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి ఆరోగ్యఆసరాగా ఉండాలనే లక్ష్యంతో ఈ ఆరోగ్యశిబిరం నిర్వహించామన్నారు. శిబిరంలో పోలీసు లకు, వారి కుటుంబసభ్యులకు బిపి, సుగర్, ఇసిజి, ఇతర వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో అనకాపల్లిటౌన్ సిఐ టి.వి.విజయ్‌కుమార్, ట్రాఫిక్ సిఐ ఎం. వెంకటనారాయణ, స్పెషల్ బ్రాంచ్ సిఐ టి..లక్ష్మీ టౌన్ ఎస్ఐ వి. సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపు రైతు సమస్యలపై వైసిపి ఆందోళన

వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న బూడి, ధర్మశ్రీ

ప్రజాశక్తి -చోడవరం : రైతుల నుంచి ధాన్యం సేకరణలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అయిందని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ ఆరోపించారు.. రైతాంగ సమస్యలపై ఈనెల 13న వైసిపి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడతామన్నారు. బుధవారం దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ధాన్యం సేకరణలో నెలకొన్న ఇబ్బందులకు గత వైసిపి ప్రభుత్వమే కారణమని అవాస్తవ ఆరోపణలు చంద్రబాబు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ధాన్యం సేకరణలో పారదర్శకత లోపించిందని, రైతులకు మద్దతు ధర అందడం లేదన్నారు. రైతులకు ఏటా రూ.20వేలు పెట్టుబడి సాయం ఇస్తామన్న చంద్రబాబు హామీ ఏమైందని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు సమస్యలపై వాట్సాప్‌లో హాయ్ అనిపెడితే స్పందిస్తామన్న మంత్రి నాదెండ్ల మనోహర్ మాటలు ఒట్టి బూటకాలేనన్నారు. తమ తప్పిదాలు కప్పిపుచ్చుకోవడానికే వైసిపిపై నిందారోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో అన్ని పంటలకు వర్తింపజేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం మద్దతు ధర కాగితాలకే పరిమితమైందని, ఎక్కడా అమలైన దాఖలాలు లేవని ఆరోపించారు. 40ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు మాటలు, చేతలు ఎటుపోతున్నాయో అంతుపట్టడం లేదని ఎద్దేవా చేశారు.. ఈనెల 27న విద్యుత్ బిల్లుల పెంపు సమస్యలపైనా, వచ్చేనెల 3న విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లింపులో జాప్యంపై వైసిపి ఆందోళన చేపడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి గాడి కాసు, ఏడువాక సత్యారావు, బొడ్డేడ సూర్యనారాయణ, దొడ్డి వెంకటరావు, పల్లా నర్సింగరావు, వేంపల్లి ఆనంద్ ఈశ్వరరావు, గాడి అప్పారావు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారించాలని నిరసన

పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయితీలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద జనసేన ఆధ్వర్యంలో మహిళలు నిరసన చేపట్టారు. పంచాయతీలో దిబ్బపాలెం, ముత్యాలమ్మపాలెం, సమ్మంగిపాలెం, జాలారిపేట నాలుగు గ్రామాలలో ఎక్కువగా మత్స్యకారులు నివసిస్తున్నారని, ఆయా గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, వీధిదీపాలు వెలగడం లేదని వాపోయారు. పేరుకుపోయిన మురుగుకాలువల్లో దోమలు విజృంభిస్తున్నా వాటి నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని, దీంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసినా ఎటువంటి స్పందన లేకపోవడంతో అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా ముత్యాలమ్మ పాలెం గ్రామ సచివాలయం వద్ద మహిళలతో ఆందోళన చేపట్టి, పంచాయితీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. దీనిపై జనసేన నేత అరిజిల్లి అప్పలరాజు మాట్లాడుతూ, సమస్యలపై స్పందించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పరదేశి, సమ్మంగి అప్పారావు, బొంది దుర్గారావు, సి హెచ్ ముత్యాలు, ఎస్.మహేష్, ఎస్.అమ్మోరయ్య, బొంది ముత్యాలు, అప్పలరాజు, బి.మహేష్ పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై ఒక రోజు శిక్షణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎసిడిపిఒ,శశికళ

ప్రజాశక్తి- కె. కోటపాడు: కౌమార దశలో బాలికలు పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని అనకాపల్లి అడిషనల్ సిడిపిఒ శశికళ కోరారు. బుధవారం స్థానిక సిడిపిఒ కార్యాలయంలో కిశోరి వికాసంపై ఒకరోజు శిక్షణలో మాట్లాడుతూ ఆరోగ్యం, పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలన్నారు. వైద్యులు డాక్టర్ తరణి, శైలజలు కిశోరబాలికలకు శారీరక మార్పులు, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఎన్ఐసిపిఒ ఎల్ మనోహర్రావు, అనకాపల్లి ఒఎస్‌సి కేంద్రం సిఎ. మంజుల వాణి కిశోర్ బాలికలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు సౌకర్యాలను వివరించారు. మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు వెల్ఫేర్ అసిస్టెంట్లు గ్రామ మహిళా కార్యదర్శి సచివాలయంలో గొల్లలపాలెం కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు శిక్షణలో పాల్గొన్నారు. వీరంతా 34 వారాలపాటు కిశోరబాలికలతో అనుసంధానం కలిగి ఉంటారని సిడిపిఒ మంగతాయారు తెలిపారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపిఎం కే చిన్నబాబు, ఇఒపిఆర్‌డి రమణి, అంగన్వాడీ సూపర్వైజర్లు ఎల్‌బి.సుశీల ఎం రాములమ్మ, ఎన్ కల్యాణి, ఆదిలక్ష్మి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు

పరవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కిశోరి బాలికల వికాసం కార్యక్రమాన్ని ఎంపిడిఒ శ్యాంసుందర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమాజంలో బాల్య వివాహాలు నిర్మూలిస్తామని, బాల్య వివాహం జరుగడానికి చేసిన ఏ ప్రయత్నమైనా పంచాయితీ, ప్రభుత్వ అధికారులకు తెలియ చేసి నియంత్రిస్తామని, బాలల విద్య భద్రతకు, బాల్యవివాహాల రహిత ఆంధ్రప్రదేశ్ సాకారానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు . కార్యక్రమం లో పరవాడ సిఐ బాలసూర్యారావు, సబ్బవరం సిడిపిఒ పరవాడ వెలుగు ఏపిఎం, ఎంఇఒలు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నర్సింగ్ అభ్యర్థులకు సౌదీ అరేబియాలో ఉద్యోగావకాశాలు

గోవిందరావు

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓఎంసిఏపి, అల్ యూసఫ్ ఎంటర్ప్రైజెస్ సంయుక్త ఆధ్వర్యంలో బిఎస్‌సి, పోస్టు గ్రాడ్యుయేషన్ నర్సింగ్ పూర్తి చేసిన అభ్యర్థులకు సౌదీ అరేబియాలోని రిహేబిలిటేషన్ సెంటర్లలో ఉద్యోగావకాశాలు ఉన్నాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్ గోవిందరావు తెలిపారు. ఆసక్తి గల యువత ఈనెల 15లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 18న ప్రీ అసెస్మెంట్ నిర్వహిస్తారన్నారు. జిల్లాలోని 18 -40ఏళ్ల నర్సింగ్ పట్టభద్రులు, ఏదైనా ఆసుపత్రిలో ఏడాదిన్నర పనిచేసిన అనుభవం ఉన్నవారు అర్హులన్నారు.. రిజిస్ట్రేషన్ ఫీజుగా జిఎస్‌టితో కలిసి రూ.37,500 చెల్లించాలని, ఎంపికైన అభ్యర్థులకు వీసా ఫీజు, రానుపోను విమాన టిక్కెట్లు అల్ యూసఫ్ ఎంటర్ప్రైజెస్ సంస్థ అభ్యర్థులు కట్టిన రిజిస్ట్రేషన్ ఫీజు నుంచే చెల్లిస్తారన్నారు. ఎంపికైన వారికి భారత కరెన్సీలో నెలకు రూ.78వేలు నుంచి, రూ.89వేలు వరకు జీతం ఉంటుందన్నారు. అభ్యర్థులు బయోడేటా, విద్యా సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్, ట్రాన్స్‌ఫ్ సర్టిఫికెట్, జననం ధ్రువీకరణ, అనుభవ సర్టిఫికెట్, వివాహ ధ్రువీకరణ పత్రం, నోటరీ లెటర్, నర్సింగ్ కౌన్సిల్ సర్టిఫికెట్, కోవిడ్ ఎంఆర్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. , నర్సింగ్ పరిజ్ఞానం, ప్రాథమిక ఇంగ్లీష్, డిజిటల్ నైపుణ్యాలలో ప్రాథమిక పరీక్షలు అర్హత పొందిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపికచేస్తారన్నారు. ముందుగా https://forms.gle/XoY8SHAdaZCtugb1A లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, skillinternational@apssdc.in ఈ మెయిల్ ఐడికి అప్‌డేట్ చేసిన రెజ్యూమ్ పంపించాలనీ సూచించారు. ఇతర వివరాలకు 9988853335, 8712655686, 8790118349, 8790117279 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మున్సిపల్ హైస్కూల్ 1969-70, 71 బ్యాచ్‌ల పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారంనిర్వహించారు. ముందుగా స్కూల్‌లోని సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్టాపన నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా గీతాజయంతి, సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం గతించిన మిత్రులకు నివాళులర్పించారు. వారి సంస్మరణార్థం పెదగంట్యాడ ట్రూత్ ఛారిటబుల్ ట్రస్ట్ అనాధాశ్రమంలోని పిల్లలకు దుప్పట్లు, బియ్యం, సబ్బులు పంపిణీతోపాటు అన్నసమారాధన చేశారు. సి.వి.రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగినకార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఇమ్మిడిశెట్టి చక్రపాణి, కార్యదర్శి దుప్పాడ పార్వతీశం, కోశాధికారి వంకాయల శంకరరావు, సహకార్యదర్శి బచ్చు వెంకట సూర్యనారాయణ, పెంటకోట ఉమామహేష్, ఎంఆర్.కె. లక్ష్మణరావు, మద్దుల రామకుమార్, గుంటూరు బంగార్రాజు, విజ్జపు మణికుమార్, బుద్ధ కృష్ణ, ఇంజరపు సత్యనారాయణ, పట్నాల రామకోటి, రాచకొండ కామేశ్వరరావు, కళ్ళేపల్లి రాజశేఖర్, డికెవి ప్రసాద్, బిహెచ్. జగదీశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి హస్తకళల ప్రదర్శన

ప్రజాశక్తి -అచ్యుతాపురం : స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో గురు శుక్ర, శనివారాల్లో మూడు రోజులపాటు హస్తకళల అవగాహన, ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర హస్తకళల సహాయ సంచాలకులు ఎన్ అపర్ణ లక్ష్మి తెలిపారు. మూడు రోజులు పాటు జరిగే కార్యక్రమంలో విద్యార్థులకు హస్తకళల పట్ల అవగాహన వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని, వివిధ రకాల హస్త కళల నిపుణులతో ముఖాముఖి ఉంటుందన్నారు. హస్త కళల పట్ల ఆసక్తి కలవారు కార్యక్రమానికి హాజరు కావచ్చని తెలిపారు.

చిత్రకళా పోటీల్లో ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్, తదితరులు

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఈనెల 6న భీమిలి డైట్‌లో కేంద్ర మానవ వనరుల శాఖ పర్యవేక్షణలో జరిగిన జిల్లాస్థాయి కళా ఉత్సవంలో భాగంగా నిర్వహించిన చిత్ర కళా పోటీలలో కాశీపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు పోటీల్లో బండారు జస్వంత్ ద్వితీయ స్థానం, దేశభక్తి గేయాల బృంద గాన పోటీలలో లలిత,గిరిష్మా, రిషిత, శిల్ప, రమ్యల గ్రూప్ తృతీయ స్థానం, మైమింగ్ గ్రూప్ ఈవెంట్‌లో జస్వంత్, మణికంఠ, కృప, శరణ్య, లోకేష్ టీమ్ తృతీయ స్థానం, 'వాయిద్యం పోటీలలో' ప్రదీప్ తృతీయ స్థానం సాధించి సత్తాచాటారన్నారు. డైట్ కాలేజీ ప్రిన్సిపల్ జ్యోతికుమారి నుంచి ప్రశంసాపత్రాలు స్వీకరించిన విద్యార్థులను బుధవారం పాఠశాలలో అభినందించారు

విద్యార్థులను తీర్చిదిద్దిన కొట్టాన రాంబాబు మాస్టారును గ్రామ సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షురాలు ఆదిరెడ్డి వరలక్ష్మి, ఉపసర్పంచ్ సింహాచలం నాయుడు, ఎంఇఒ వడాల దాసు, ఉషారాణి, హెచ్ఎం పిబిటి సుందరి,ఉపాధ్యాయులు సుజాత రామలక్ష్మి, రాము మాధవి, సత్యవతి పూర్ణిమ, సూర్య తదితరులు అభినందించారు.

రేషన్ డీలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల పరిధిలో ఖాళీగా ఉన్న దేవరాపల్లి -2, నాగయ్యపేట, కాశీపురం, కలిగొట్ల గ్రామాలలో రేషన్‌డిపోల డీలర్ల పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీకి అర్హులైన నిరుద్యోగ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ పి.లక్ష్మీదేవి తెలిపారు. దేవరాపల్లి -2 (ఇడబ్ల్యుఎస్- మహిళ), నాగయ్యపేట (ఒసి- మహిళ), కాశీపురం (ఒసి), కలిగొట్ల (ఎస్‌సి) కేటగిరికి రిజర్వ్ చేశారని, సంబంధిత సామాజిక వర్గాలకు చెందిన స్థానిక అభ్యర్థులు ఈనెల 13 లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 26న రాత పరీక్ష, 27న మౌఖిక పరీక్ష నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు.

ఎంఎస్ఎంఇల సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని చేపడుతున్న ఎంఎస్ఎంఇ సర్వేపై సచివాలయం సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణనిచ్చారు. స్థానిక ఎఒ కెఎస్‌పి నారాయణరావు ప్రారంభించిన శిక్షణ శిబిరంలో పారిశ్రామిక శిక్షణ అధికారి పాల్గొని సర్వేపై పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎఒ నారాయణ రావు మాట్లాడుతూ మండలంలోని స్మాల్, మీడియం పరిశ్రమలపై ఆయా పంచాయతీల సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు పాల్గొని పూర్తి వివరాలను సేకరించాలన్నారు.విజయవంతం చేయాలని కోరారు.

బుచ్చెయ్యపేట : ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్ని సర్వేలు వంద శాతం పూర్తి చేసే విధంగా పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపిడిఒవి. విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంఎస్ఎంఇ సర్వే, సచివాలయ సిబ్బంది పనితీరుపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమల వద్దకు వెళ్లిసమగ్ర సమాచారం రాబట్టి యాప్ లలో నమోదు చేయాలన్నారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో క్రైట్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అనంతపురంలో నిర్వహించిన అండర్ 17 షూటింగ్ బాల్ పోటీలలో అచ్యుతాపురం క్రైట్స్ విద్యా విహార్ స్కూల్ విద్యార్థులు ప్రతిభకనబరిచి జాతీయస్థాయిలో రెండవ స్థానం సాధించారు. జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థులను క్రైట్స్ విద్యా వ్యవహారాల కరస్పాండెంట్ రెడ్డి గణేష్, ప్రిన్సిపల్ ప్రసన్న, డైరెక్టర్ ప్రియాంక, ఫిజికల్ డైరెక్టర్ శివాజీ అభినందించారు.

పరిశోధనల్లో మేటి ఆర్ఎఆర్ఎస్

- 111ఏళ్ల చరిత్ర కలిగిన కేంద్రంలో 65వ కిసాన్‌మేళా రేపే
- సర్వం సిద్ధం చేసిన వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం

ప్రజాశక్తి-అనకాపల్లి : నూతనచెరకు వంగడాల రూపకల్పనలో దేశంలోనే పేరుగాంచింది అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం.1913లో 103 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నెలకొల్పబడి 77 ఎకరాల్లో పరిశోధనలను నిరంతరాయంగా కొనసాగిస్తోంది. ఉత్తర కోస్తా జిల్లాలైన అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళంలో చెరకు, వరి, అపరాలు, చిరుధాన్యాలు, నూనె గింజలపై అనేక పరిశోధనలు జరిపి నూతన వంగడాలు, వ్యవసాయ యాజమాన్య పద్ధతులను అభివృద్ధి చేసి రైతులకు చేరవేస్తోంది. మంచి రస నాణ్యత కలిగిన ఎర్ర కుళ్ళు తెగులు పూర్తిగాను, కాటుక తెగులు కొంతవరకు తట్టుకుని హెక్టారుకు 130 టన్నుల దిగుబడినిచ్చే సుమారు 21 చెరకు రకాలను ఇక్కడి శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ప్రస్తుతం విడుదల చేసిన నానో యూరియాపై పరిశోధనలు ప్రారంభించడం, పసుపు ఆకు తెగులు, యాజమాన్యంపై పరిశోధనలు చేస్తోంది. అలాగే అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల రైతాంగానికి గ్రామీణ కృషి మౌసమ్ సేవా పథకం ద్వారా భవిష్య వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలను ఎప్పటికప్పుడు సుమారు 18 వాట్సాప్ గ్రూపుల ద్వారా ఆరువేల మంది రైతులకు సమాచారాన్ని అందించడంతో పాటు స్థానిక దినపత్రికలు, ఆకాశవాణి ద్వారా కూడా సమాచారాన్ని రైతులకు అందిస్తోంది. చెరకులో చీడపీడలను తట్టుకునే రకాల ఎంపికతో పాటు వరి, మొక్కజొన్న, చిరుధాన్యాల్లో చీడపీడల యాజమాన్యాలపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. దీంతో పాటు వివిధ పంటల్లో సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ విధానాలపై పరిశోధనలు జరిపి సుస్థిర సాగు పద్ధతులను రైతులకు తెలియజేస్తున్నారు. పరిశోధన కేంద్రంలో పొడి, ద్రవ రూప జీవన ఎరువుల తయారీ కేంద్రాలు స్థాపించి అతి తక్కువ ధరతో నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి జీవన ఎరువులను అన్ని పంటలకు అందిస్తున్నారు. జీవన ఎరువుల వినియోగం ద్వారా రసాయనిక ఎరువుల వాడకం 25% వరకు తగ్గించుకోవడంతో పాటు నేల సామర్థ్యాన్ని కాపాడుకోవడం, నాణ్యమైన దిగుబడులు రైతులు పొందుతున్నారు. ప్రధానంగా చెరకులో పంట కోత అనంతరం సాంకేతిక పరిజ్ఞానంపై విస్తృత పరిశోధనలు హైడ్రోస్ వాడకుండా సేంద్రియ పద్ధతుల్లో బెల్లం నాణ్యత పెంచడంపై పరిశోధనలో భాగంగా నవీన బెల్లం ప్లాంట్‌ను స్థాపించి రోజుకు టన్ను బెల్లాన్ని లేదా 1500 లీటర్ల బెల్లం పాకాన్ని లేదా ఎనిమిది వందల కిలోల బెల్లం పొడిని తయారు చేయవచ్చని నిరూపించారు. దేశంలోనే అత్యుత్తమంగా భావించే ఉప్పుడు బియ్యం ప్రాసెసింగ్, బెల్లం పొడి, బెల్లం పొడి తయారీ మరియు బెల్లం పూతరేకుల యంత్రంపై నాలుగు పేటెంట్లు ఆర్ఎఆర్ఎస్ సాధించడం రాష్ట్రానికే గర్వకారణం. అలాగే వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ చేయు ఆగ్రో ప్రాసెసింగ్ సెంటర్ను స్థాపించి పలు యంత్రాలపై రైతులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. దీంతో పాటు కోటి 33 లక్షలతో ఇంక్యుబేషన్ సెంటర్ స్థాపించి చిరుధాన్యాల, పనస ప్రాసెసింగ్ యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు. హెరిటేజ్ బిల్డింగ్‌లో వ్యవసాయ సమాచార కేంద్రం నెలకొల్పి వివిధ విభాగాల పరిశోధన ప్రగతి, ముఖ్య కార్యక్రమాలను పోస్టర్లు, కరపత్రాలు, పుస్తకాల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుంది.

కిసాన్ మేళాకు సిద్ధం చేస్తున్న వేదిక

ఆర్ఎఆర్ఎస్‌కు అవార్డులు

ఆర్ఎఆర్ఎస్‌కు జాతీయస్థాయిలో 2018 -19కి అత్యుత్తమ సెంటర్‌గా అఖిలభారత సమన్వయ కేంద్రానికి గుర్తింపు లభించింది. అలాగే 2019- 20లో రాష్ట్రంలోనే అత్యుత్తమ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంగా గుర్తింపు, పంట కోత అనంతర సాంకేతిక విభాగంలో 2020- 21, 2023 -24 సంవత్సరాలకు జాతీయస్థాయిలో ఉత్తమ కేంద్రంగా అవార్డు దక్కించుకుంది. అఖిలభారత జీవ నియంత్రణ విభాగం అనకాపల్లి కేంద్రానికి 2019 -20లో ఏ గ్రేడ్ సెంటర్‌గా గుర్తింపు లభించింది. అలాగే ఇక్కడ పనిచేసే శాస్త్రవేత్తలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన వ్యాసాలను ప్రచురించడం, ఉపన్యాసించడం ద్వారా అనేక అవార్డులు, ప్రశంసలు పొందారు.

రైతుకు ఆదాయం పెంచడమే లక్ష్యం

అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం స్థాపించి 111 ఏళ్ళ పూర్తి చేసుకుంది. ఈ కాలంలో రైతులకు చెరకు తక్కువ ఉత్పత్తి నుంచి గరిష్ఠంగా హెక్టారుకు 130 టన్నుల ఉత్పత్తి అయ్యే చెరకు వంగడాలను రూపొందించాం. కాలానుగుణంగా వస్తున్న మార్పులకు ఎప్పటికప్పుడు సాంకేతికతను జోడించి ఆ రైతు ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నాము.

దాక్టర్ ముకుందరావు, ఎడిఆర్, ఆర్ఎఆర్ఎస్

విద్యార్థినులను వేధిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్‌పై దాడి

చోడవరం పాలిటెక్నిక్ కాలేజీలో ఘటన : పోలీసుల అదుపులో నలుగురు యువకులు

ప్రజాశక్తి -చోడవరం : విద్యార్థినులను వేధింపు, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడన్న ఆరోపణలతో చోడవరం పాలిటెక్నిక్ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్ సూరెడ్డి కనకరాజును ఒక విద్యార్థిని సోదరుడు, అతని మిత్రులు దాడి చేశారు. ఈ ఘటనలో నలుగురు యువకులపై కేసు నమోదుచేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలివి.

విశాఖపట్నం అక్కయ్యపాలేనికి చెందిన కొంతమంది విద్యార్థినులు చోడవరం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో చదువుతున్నారు. ఇదే ప్రాంతానికి చెందిన సూరెడ్డి కనకరాజు అదే పాలిటెక్నిక్ కాలేజీలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తూ, రోజూ విద్యార్థులతో కలిసి బస్సులో రాకపోకలు సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కొంతమంది విద్యార్థినుల పట్ల కనకరాజు అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఒక విద్యార్థిని తమ బంధువులకు విషయం తెలిపింది. దీంతో ఆగ్రహించిన విద్యార్థిని సోదరుడు మకరన్న కృష్ణ, మరో ముగ్గురు స్నేహితులతో కలిసి, కాలేజీలో కనకరాజుపై దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన కనకరాజును చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. దాడి చేసిన నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే విద్యార్థినుల ఫిర్యాదుపై కనకరాజుపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. పరస్పర ఫిర్యాదులపై . పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి -మునగపాక: మండలంలోని మూలపేట, గొల్లల పాలెం గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణాలకు బుధవారం టిడిపి, జనసేన మండల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి పాలనలోనే గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. మట్టిరోడ్లతో ఇక్కట్లు పడుతున్న గ్రామీణ ప్రాంతాల వారికి సిసి రోడ్ల నిర్మాణంతో రాకపోకల కష్టాలకు విముక్తి కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు భీశెట్టి గంగప్పలనాయుడు, మొల్లి వెంకటలక్ష్మి, మొల్లి అప్పలనాయుడు, సిరా వెంకటలక్ష్మి, వెంకునాయుడు, చిన్న, సీర పెంటారావు, ఆడారి జనార్ధన్, ఆదినారాయణ, కాండ్రేగుల గాంధీ, కాండ్రేగుల నాగేంద్ర, జెకె. నాయుడు, కొలుసు వెంకట అప్పారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి -బుచ్చెయ్యపేట : ప్రకృతి వ్యవసాయంలో మెరుగైన యాజమాన్య పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజ్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని కొండెంపూడి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ సౌజన్య, కిషోర్ కుమార్, పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు

ఘనంగా రాజు జన్మదిన వేడుకలు

రాజుతో కేకు కట్ చేయిస్తున్న స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి -చోడవరం :చోడవరం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్.రాజు జన్మదిన వేడుకలు బుధవారం చోడవరంలో ఘనంగా నిర్వహించారు. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, జనసేన నాయకులు గడ్డం బుజ్జి, టిడిపి నాయకులు గూనూరు మల్లునాయుడు, గేదెల సత్యనారాయణ, కర్రి తమ్మున్నాయుడు, తదితరులు రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో అల్లం రామప్పారావు, సిరిపురం రమేష్, నరవ సరోజిని, గూనూరు మూలనాయుడు, కర్రి రమేష్, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి సాయం అందజేత

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని మొగలిపురంలో గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన కర్రి పెంటయ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన సాయం రూ.70వేలు చెక్కును స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అందజేశారు కార్యక్రమంలో తమరాన సత్యనారాయణ, మేడపాటి రాము పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం

వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న డిటి

ప్రజాశక్తి- నక్కపల్లి:రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి వచ్చిన అర్జీలు పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని డిటి అన్నాజీరావు అన్నారు. మండలంలోని దేవవరం గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు అర్జీలను అందజేసారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సత్తిబాబు, మాజీ సర్పంచ్ దేవర సత్యనారాయణ పాల్గొన్నారు.

రావికమతం :మండలంలోని గుడ్డిప గ్రామంలో తహసిల్దారు బి.వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న చిన్న చిన్న భూ సమస్యలను సరి చేసుకునేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సతీష్, మండల సర్వేయర్ సురేష్, విఆర్ఓ బాలాజీ, కూటమి నాయకులు మజ్జి అప్పారావు, సత్యారావు, పిల్లా రమణ, నాని బాబు, అన్నంశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

రోలుగుంట:రైతుల భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహశీల్దార్ నాగమ్మ అన్నారు. బుధవారం రోలుగుంట మండలం శరభవరం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతుల భూసమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సదస్సులో రైతులు తమ భూ సమస్యలపై అర్జీలు అందజేయాలన్నారు. గ్రామంలో ఎనిమిది మంది మ్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శంకర్, ఆర్ఐ రామ్మూర్తి, వీఆర్వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

విశాఖ కలెక్టరేట్: రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యలను పరిశీలించి పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం 35 వ వార్డ్ ప్రసాద్ గార్డెన్స్ వద్ద రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ, సదస్సులో వచ్చిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జూన్ 4 కమీషనర్ మల్లయ్య నాయుడు, వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, డిప్యూటీ తహసిల్దార్ జిలాని పాల్గొన్నారు.

అనకాపల్లి : భూ సమస్యల నుంచి రైతులకు విముక్తి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం రైతు సదస్సులు నిర్వహిస్తుందని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. బుధవారం అనకాపల్లి పట్టణం సుంకరమెట్ట దేవస్థానంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో మాట్లాడుతూ, అవినీతికి తావు లేకుండా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న సదస్సులను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ విజయ్ కుమార్, 80 వార్డు టిడిపి ఇన్‌ఛార్జి బొడ్డేడ జోగి నాయుడు, ఆర్ఐ రమేష్, విల్లూరి హరికిష్ణ, మహేష్, సూర్యనారాయణ దేవస్థానం చైర్మన్ మురళి పాల్గొన్నారు.

కశింకోట :మండలంలోని అచ్చర్లలో తహశీల్దార్ అడబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులో పలు సమస్యలపై రైతుల నుంచి అర్జీలుస్వీకరించారు. కూటమి నేతలు నైనంశెట్టి రమణారావు, దొడ్డి నాగేశ్వరరావు, నిమ్మదల సన్యాసినాయడు, జాన్ రైతులు పాల్గొన్నారు.

కె. కోటపాడు : మండలంలోని ఆర్లి గ్రామంలో రెవెన్యూ సదస్సులో తహసిల్దార్ పి.భాగ్యవతి పాల్గొని, రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. విఆర్ఓలు కండిపల్లి ఈశ్వరరావు, పూడి శేషు, జగదీష్, మాజీ సర్పంచ్ బోలెం అక్కన్న పాత్రుడు (బుల్లి దొర), సీరంరెడ్డి రెడ్డి, సీరంరెడ్డి ప్రసాద్, నాగిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

సబ్బవరం: మండలంలోని ఎల్లుప్పి, బోదువలసలో గ్రామాలలో జరిగిన రెవెన్యూ సదస్సులలో తహశీల్దార్ బి.చిన్నికృష్ణ పాల్గొని, ఎల్లుప్పిలో 13, బోదువలసలో నాలుగు దరఖాస్తులు స్వీకరించారు. ఎల్లుప్పి సర్పంచ్ ఉగ్గిన దేముడమ్మ, ఉపసర్పంచ్ ఉగ్గిన నాయుడు, బోదువలస సర్పంచ్ నెబర్తి శ్రీనివాసరావు, ఎంపిటిసి ఉగ్గిన లక్ష్మి రాము, ఆర్. ఐ వీరయ్య, అయ్యన్నపాలెం విఆర్ఓ ఎం గోవిందరావు పాల్గొన్నారు.

పెందుర్తి : మండలంలోని రాజయ్యపేట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు 30 దరఖాస్తులు వచ్చాయని, పరిశీలించి పరిష్కరిస్తామని తహశీల్దార్ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసన్నలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం: ఆనందపురం మండలం రామవరం గ్రామంలో రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ చేతన్‌కుమార్ అర్జీలను స్వీకరించారు. జివిఎన్ అగ్రహారంలో రీసర్వేలో అవకతవకలను సరిచేయాలని, రామవరం గ్రామకంఠ భూములను రిజిస్ట్రేషన్ అయ్యేలా పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని రామవరం సర్పంచ్ పైడిరాజు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రీటా, విఆర్ఓ పాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారమివ్వాలి

అచ్యుతాపురం : వెదురువాడలో 143 మంది దళితులు, వృత్తిదారులు, కూలీల నుంచి ఎపిఐఐసి తీసుకున్న భూములకు ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వలేదని, వెంటనే చెల్లింపులకు చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులో అధికారులకు నిర్వాసితులు దరఖాస్తు అందజేశారు. 2005లో సర్వే నెంబరు ఒకటిలో అప్పటి ప్రభుత్వం 143మందికి పట్టాలివ్వగా,జీడిమామిడి తోటలు పెంచి జీవనోపాధి పొందుతున్నారని, ఆయా భూములను తీసుకున్న ఎపిఐఐసి పరిహారం చెల్లింపులో జాప్యం చేస్తోందన్నారు. తక్షణమే పరిహారం చెల్లింపునకు చర్యలు చేపట్టాలని డిటికి దరఖాస్తు చేశారు. కార్యక్రమంలో నిర్వాసితులు కిల్లాడి బాపూజీ, సత్యనారాయణ, లక్ష్మి, ఆంజనేయులు పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న సిపిఎం నాయకులు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ
మహా సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఈ నెల 13,14తేదీలలో ఎల మంచిలిలో జరగనున్న ఎస్ఎఫ్ఐ అనకాపల్లి జిల్లా 3వ మహా సభలను జయప్రదం చేయాలని స్థానిక ప్రభుత్వ కళాశాలలో పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు గౌతమ్ మాట్లాడుతూ, నిరంతరం విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాడుతూ సమస్యలను పరిష్కరించే వరకూ పోరాటాలు చేస్తుందన్నారు. భవిష్యత్తు కార్యాచరణ పై ఈ మహాసభల్లో సమీక్షలు నిర్వహించి నూతన కమిటిని ఎన్నికోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ జనార్ధన్, వైస్ ప్రెసిడెంట్ బూషణ్‌రావు, డివిజన్ సభ్యులు బార్గవ్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాశీనాయుడు

ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:రానున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం కోసం కూటమి నేతలంతా సమిష్టిగా కృషి చేయాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని సారిపల్లిపాలెం హోం మంత్రి స్వగృహం వద్ద బుధవారం కూటమి నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలపై పెద్దపీట వేసే వారికి అవకాశం కల్పించాలని సూచించారు. కూటమి నాయకులంతా ఒకేమాటపై ఉండి విజయానికి కృషి చేయాలన్నారు.ఇప్పటికే గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతు న్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాలుగు మండలాల అధ్యక్షులు పెద్దిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేష్, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను, జనసేన నాలుగు మండలాల అధ్యక్షులు వై.నానాజీ, వి.సుధాకర్, పి.శివ, యస్ శ్రీనివాసరావు, బిజెపి నాలుగు మండలాల అధ్యక్షులు వి.రమణ ,కె.శ్రీనివాసరావు, జోగినాయుడు, కనకరాజు పాల్గొన్నారు.

సభ్యత్వాన్ని అందజేస్తున్న తాతాజీ

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: టిడిపి సభ్యత్వం కార్యకర్తలకు భరోసాని కల్పిస్తుందని ఆర్.శివరాంపురం ఆ పార్టీ గ్రామ అధ్యక్షులు దేవర తాతాజీ తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యకర్తలకు ఎటువంటి ప్రమాదాలకు లోనైనా పార్టీ పరంగా బాధిత కుటుంబాలను ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సభ్యత్వ నమోదును పలువురు చేసుకున్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

ప్రజాశక్తి-రావికమతం: తుపాను ప్రభావం కారణంగా రైతులందరూ వరి కోతలు వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్ రావు తెలిపారు. మండలంలో మేడివాడ గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనకాపల్లి జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు పాల్గొని రైతులకు తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 13 వరకు తుఫాను ప్రభావం ఉన్నందున రైతులందరూ వరి కోతలు వాయిదా వేసుకోవాలని, అలాగే ఇప్పటికే వరి కోతల కోసిన వారు వెను వెంటనే చిన్న చిన్న కుప్పలుగా పెట్టుకొని జాగ్రత్త పడాలన్నారు. సంవత్సరకాలం జీవనోపాధి వరి పంటను పాడు చేసుకోకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. బయట ఎత్తైన ప్రాంతంలో కుప్పలుగా పెట్టుకోవాలని ఆయన సూచించారు. మినుము పంటకి ఇన్సూరెన్స్ నిమిత్తము రూ.300 చెల్లించాలని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు పర్సంటేజీని బట్టి 20 వేల రూపాయలు బీమా వస్తుందని ఆయన తెలిపారు .అనంతరం పలు ఎరువుల షాపులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రావికమతం మండల వ్యవసాయ అధికారిని రూప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న మోహన్‌రావు

పోలీసులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు నర్సీపట్నం సబ్ డివిజన్లో ఉన్న 40 సంవత్సరాలు పైబడి వయసున్న పోలీస్ సిబ్బందికి బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. డిఎస్పీ జిఆర్ఆర్ మోహన్ ఆధ్వర్యంలో బుధవారం సబ్ డివిజన్ పరిధిలో 22 మంది పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పోలీస్ అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ సిఐ జి గోవింద రావు, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పప్పుశెట్టి పాలెం గ్రామ పంచాయతీ శివారు జమ్మదేవిపేట గ్రామంలో పాలకవర్గం అనుమతి లేకుండా గ్రామస్తులు నిర్మించుకున్న దేవాలయ మండపానికి పంచాయతీ నిధులు కాజేసారని గ్రామస్తులు ఫిర్యాదుపై బుధవారం ఎంపిడిఓ మేరీరోజ్, ఈఓపిఆర్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుల నుండి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జమ్మదేవిపేట గ్రామంలోని కమ్యూనిటీ భవనాన్ని పాలకవర్గ సభ్యులతో కలిసి పరిశీలించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాకిరెడ్డి వరహాలు బాబు, మాజీ సర్పంచ్ బెల్లపు కొండలరావు, మాజీ సర్పంచ్ వార్డు సభ్యులు గొర్లెటి రాజు, పసుపులేటి బాలాజీ, అడిగర్ల నారాయణ, రాయపురెడ్డి మహాలక్ష్మి, నంక రమణ, మణికంఠ పాల్గొన్నారు.

విచారణ చేస్తున్న అధికారులు

వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - చీడికాడ: మండలంలోని మంచాల గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పంచాయతీ గ్రీన్ గార్డ్‌కు 23 నెలల జీతాలు ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి ఆర్.దేముడు నాయుడు, గ్రామ ఉప సర్పంచ్ కసిరెడ్డి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సమస్య పై జిల్లా కలెక్టర్‌కు గ్రీన్ గార్డ్ మామిడి చెల్లయ్యమ్మ ఫిర్యాదు చేశారన్నారు. గ్రీన్ గార్డ్ మామిడి చెల్లయ్యమ్మ భర్త మరణించడంతో కుమార్తెను చూసుకొని ఈ పని చేసుకుని జీవిస్తూ ఉంటున్నారు. గ్రీన్‌గార్డు జీతం అడిగితే తొలగిస్తామని గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ చెబుతూ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారన్నారు. అలాగే గ్రామపంచాయతీ కార్మికులు కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులందరికీ జీతాలు ఇవ్వాలన్నారు.

నేడు, రేపు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి కోటవురట్ల: పంచాయతీ ప్రణాళిక, అభివృద్ధి పై సర్పంచ్‌లు, కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణా తరగతులకు హాజరు కావాలని ఎంపిడీవో కాశీ విశ్వనాథరావు కోరారు. ఈనెల 12,13 తేదీల్లో మండల పరిషత్ సమావేశ మందిరంలో జరగనున్న ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

స్కేటింగ్‌లో చైత్ర దీపిక ప్రతిభ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నేషనల్ రోలర్ స్కేటింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నర్సీపట్నంకు చెందిన చైత్రదీపిక చైత్ర దీపిక వరుస విజయాలతో దూసుకుపోతుంది. నేషనల్ రోలరు స్కేటింగ్ ఛాంపియన్షిప్స్ జాతీయ స్థాయి పోటీల్లో ఇప్పటి వరకు 11 పతకాలను కైవసం చేసుకున్న చైత్ర దీపిక, తాజాగా మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. పొల్లాచి (కోయంబత్తూరు) లో ఈ నెల 5 నుంచి 15 వరకు జరుగుతున్న నేషనల్ రోలరు స్కేటింగ్ ఛాంపియన్షిప్స్ (రోలరు. స్కేటింగ్ ఫెడరేషన్ అఫ్ ఇండియా)లో 14-17 వయసు విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరుపున కపుల్ డాన్స్ స్కేటింగ్ లో దీటైన ప్రదర్శిన ఇచ్చి కాంస్య పతకం సాధించింది. నర్సీపట్నంకు చెందిన చైత్రదీపిక, తన తండ్రి పెదిరెడ్ల రామ సతీష్ ఉద్యోగరీత్యా విజయవాడలో ఉండటంతో, అక్కడే సాధన చేస్తుంది. జాతీయస్థాయిలో పతకాలు సాధించినందుకు స్థానిక క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు.

నోటిఫికేషన్‌ను ప్రదర్శిస్తున్న అధికారులు

నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం

ప్రజాశక్తి-మాడుగుల: ఈనెల 14వ తేదీన జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు బుధవారం జల వనరుల శాఖ ఏఈ భార్గవ్ కుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు.జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో అన్ని సచివాలయాల్లో ఆయా అధికారులతో జారీ అయిన నోటిఫికేషన్ను నోటీస్ బోర్డులో ఏర్పాటు చేశారు. పెద్దేరు, తారకరామా, ఉరకగెడ్డ, గొర్రిగెడ్డ, పాలగెడ్డ ఈ ఐదు జలాశయాల పరిధిలో రాచకట్టులు వున్నాయి. నీటి సంఘాల అధ్యక్షులుగా పోటీ చేసేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు నాయకులు హెూరాహెూరీగా పోటీ పడుతున్నారు.. కొన్నిచోట్ల ఈ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా జరగనున్నాయి.

రోలుగుంట: ఈ నెల 14న మండలంలో 10 సంఘాలకు ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, నీటి వినియోగదారుల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మండల తహశీల్దార్ సీహెచ్.నాగమ్మ తెలిపారు. మండలంలో 10 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆయా పోలింగ్ స్టేషన్ల వద్ద నోటీసులు అంటించామన్నారు.

'అన్నదాతకు అండగా' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - చీడికాడ: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అన్నదాతలకు అండగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చీడికాడ మండల పార్టీ కన్వీనర్ గొల్లవెల్లి రాజబాబు కోరారు. ఈ మేరకు కరపత్రం విడుదల చేశారు. మాజీ డిప్యూటీ సీఎం, అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో అన్నదాతలకు అండగా కార్యక్రమాన్ని ఈనెల 13న అనకాపల్లి కలెక్టర్ ఆఫీసు వద్ద చేపడతామన్నారు. వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు,రైతులు 13న ఉదయం తొమ్మిది గంటలకు అనకాపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ మలసాల భరత్ కార్యాలయం వద్దకు చేరుకోవాలన్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేయాలి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు కోరారు. బుధవారం విశాఖ జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే ఈ పనులు చేపట్టాలన్నారు. అంగన్వాడీ సెంటర్లకు భవనాలు లేని వాటికి భవనాలు కేటాయించాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ కల్చరల్ ఫెస్ట్ అదుర్స్

-చివరి రోజూ సాంస్కృతిక ప్రదర్శనల జోష్

డ్యాన్స్‌లు చేస్తున్న యువత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎస్ఎఫ్ఐ ఆంధ్ర యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యాన వర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో జరుగుతున్న కల్చరల్ ఫెస్ట్‌లో రెండో రోజైన బుధవారమూ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మంగళవారం ఆరంభం అదిరితే.. బుధవారం ముగింపు అంతకు మించి సాగింది. భరతనాట్యం, ఫోక్ డ్యాన్స్‌లు కట్టిపడేశాయి. మహిళలపై హింసను వ్యతిరేకిస్తూ సాగిన ప్రదర్శన ఆలోచింపజేసింది. సినీ గీతాలకు విద్యార్థులు చేసిన డ్యాన్సులకు చప్పట్ల వర్షం కురిసింది. రెండో రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమెన్స్ హాస్టల్ చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ ఎ.పల్లవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఇటువంటి ఫెస్ట్ జరగడం, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీయవచ్చన్నారు. ప్రొఫెసర్ ఎన్.విజయ మోహన్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షిం చారు. విద్యార్థు లందరూ ఆట, పాటలు, సాంస్కృతిక సంబరాల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడుతూ తమ సంఘం ఉద్యమాలతో పాటు ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలనూ నిర్వహిస్తుందన్నారు. సంఘం ఆంధ్ర యూనివర్సిటీ కార్యదర్శి డి.వెంకట రమణ మాట్లాడుతూ రెండు రోజులపాటు తలపెట్టిన ఈ ఫెస్ట్‌కు విశేష ఆదరణ లభించిందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, నాయకులు రాము, అజయ్, హర్షిత్, సునీల్, అరుణ్, గుణ, సౌమ్య, అంజలి, సుజిత పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న విద్యార్థినులు

ప్రశంసాపత్రాలు అందజేస్తున్న విజయమోహన్

ఫెస్ట్‌కు హాజరైన యువతుల సందడి

ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి- మాడుగుల: గిరిజనుల ఉపాధి కల్పనకు ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. బుధవారం మండలంలో జాలంపల్లి పంచాయతీ కామకూటం గ్రామంలో డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ గీతం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆరోహన్ ట్రైబల్ సొసైటీ గిరిజనులకు శిక్షణ అందించే భవన నిర్మాణ పనులకు శంకుస్థాపనను ఎమ్మెల్యే నిర్వహించారు. గిరిజన ప్రాంతాలైన గొప్పులపాలెం, లోవకొత్తపల్లి, లోవకృష్ణాపురం, కామకూటం గ్రామాలలో మహిళలకు లభ్యమయ్యే అరటి చెట్లు, అరటి బోదెల నుండి నార తీయుట, వాటితో ఉపయోగకరమైన వస్తువులను తయారీపై శిక్షణ ఇవ్వడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని ఎమ్మెల్యే అన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన మహిళలందరూ ఉపయోగించుకొని ఉపాధిని కల్పించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ ప్రాజెక్ట్ అసిస్టెంట్ పవన్ కళ్యాణ్, ఆరోహన్ ట్రైబల్ సొసైటీ కోఆర్డినేటర్ అప్పారావు, సురేష్ పట్నాయక్, ఎంపీడీవో కొంకి అప్పారావు, టిడిపి నాయకులు పుప్పాల అప్పలరాజు, అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, పుప్పాల రమేష్, రాజ్ కుమార్, జెర్రిపోతుల సూర్యనారాయణ, సుంకరి సింహాచలం నాయుడు, పెంటకోట జగన్నాథరావు, ఎంపిటిసి గంగ రాజు, పల్లా నాయుడు ఇన్చార్జ్ ఈఓపీఆర్డి పిఎల్. సతీష్ కుమార్, ఏపీఓ జె.మురళీకృష్ణ పాల్గొన్నారు.

పూర్తయిన సామాజిక భవనం

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ మండలం ఏఎల్.పురం మేజర్ పంచాయతీ ఎస్సీ బీసీ కాలనీలో గత ప్రభుత్వ హయాంలో మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమాశంకర్‌గణేష్ సూచనతో అప్పటి పార్లమెంట్ సభ్యురాలు భీశెట్టి సత్యవతి ఎస్సీ సామాజిక భవనం కోసం రూ.7లక్షలు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ పనులు పూర్తయ్యాయి. దీంతో మంగళవారం సర్పంచ్ లోచల సుజాత ఈ భవనంను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఎస్సీ సామాజిక భవనం సుందరంగా తయారైందన్నారు. గతంలో ఈ కాలనీ వాసులు ఎటువంటి సమావేశాలు, శుభకార్యములు చేసుకోవాలన్న భవన సదుపాయం లేక చాలా ఇబ్బంది పడే వారన్నారు. ఇప్పుడు ఈ సామాజిక భవన నిర్మాణంతో ఆ సమస్య తీరుతుందని ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారు. త్వరలో దీన్ని ప్రారంభిస్తామని చెప్పారు.

అందుబాటులోకి మ్యూజికల్ ఫౌంటెయిన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాఖ సెంట్రల్ పార్క్ ను మరింత ఆహ్లాద కరమైన వాతావరణం ఉండేలా చూస్తామని వీఎంఆర్ డిఎ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్, దక్షిణ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ అన్నారు.బుధవారం ఉదయం ఆర్టీసీ కాంప్లెక్ ఎదురుగా ఉన్న విశాఖ సెంట్రల్ పార్క్ ను వీఎంఆర్ డిఎ కమిషనర్ కె.ఎస్ విశ్వనాథన్, ఇతర విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి సందర్శించారు. పార్క్ లో ఉన్న వాకర్లతో మాట్లాడి అక్కడ ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వీఎంఆర్ డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ, అతి త్వరలో పార్క్ లో మ్యూజికల్ ఫౌంటెన్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకు వస్తామని చెప్పారు.పార్క్‌లో పిల్లల కోసం క్రీడా పరికరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.ఓపెన్ జిమ్ పరికరాలు మరమత్తులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పార్క్ ఆవరణలో దివిస్ సంస్థ సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి ప్లాంట్‌ను ప్రణవ్ గోపాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఇ భవాని శంకర్, డిఎఫ్ఓ శివాని, నాయకులు వానపల్లి గాయత్రి, ఫణి కుమారి, మహేష్ యాదవ్, నక్కా కనకరాజు, బాయిన సునీల్, వాకర్ల ప్రతినిధి పాత్రుడు పాల్గొన్నారు.

జర్నలిస్టుల క్రీడా ట్రోఫీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: సమాజ సేవలో నిరంతరం తీవ్ర ఒత్తిడికి లోనయ్యే జర్నలిస్టులు క్రీడా పోటీలు నిర్వహించుకోవడం అభినందనీయమని ఏపి ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఛైర్మన్, ఉపాకార్ ట్రస్టు అధినేత కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి 22 వరకు జీవీఎంసీకి చెందిన ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో విశాఖ మీడియా క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికను , ట్రోఫీలను కంచర్ల ఎంవీపీలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వారం రోజుల పాటు మీడియా మిత్రులు పోటీలు నిర్వహించుకోవడం వల్ల వారిలో క్రీడా స్ఫూర్తి పెరగడంతో పాటు శారీరక దేహదారుడ్యం మెరుగుపడుతుందన్నారు. సింహాచలం దేవస్థానం మాజీ ధర్మకర్త, విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం సలహా మండలి సభ్యులు , జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ టోర్నమెంట్ పూర్తి స్థాయిలో విజయవంతం కావాలని కోరారు.టోర్నీ నిర్వాహకులు గురుప్రసాద్,మదన్ ,ఈశ్వరరావు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో ఆదివాసీ యువత

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: జాతీయ గిరిజన యువజన సమ్మేళనంలో పాల్గొన్న ఆదివాసి యువత బుధవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొంది. ఋషికొండ బీచ్ లో పరిశుభ్రత పనులు నిర్వహించింది. గీతం విశ్వవిద్యాలయం కేంద్రంగా ఐదు రోజులుగా జరుగుతున్న 16వ జాతీయ యువజన గిరిజన సమ్మేళనంలో చత్తీష్‌గడ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఆదివాసి యువతీ యువకులు పాల్గొన్న విషయం తెలిసిందే. బుధవారం ఉదయం విశ్వవిద్యాలయం ప్రాంగణంలో యువతీ యువకులు మొక్కలు నాటారు. అనంతరం యూత్ పార్లమెంట్‌లో పాల్గొన్నారు. ఇందులో గీతం యూనివర్సిటీ విద్యార్థులు కూడా భాగస్వామ్యం అయ్యారు. అనంతరం గీతం విశ్వ విద్యాలయం విద్యాలయాన్ని ఆదివాసి యువత సందర్శించింది.